ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

గురువారం 6 మార్చి 2025



పట్టు రైతులకు ప్రోత్సాహం అందించండి



పట్టు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చి ఆదుకోవాలి.2014 - 2019 సంవత్సరాల నడుమ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలతో వారిని ఆదుకుంది.పట్టు పురుగులు పెంచేందుకు షెడ్లు నిర్మించుకోవడానికి,మొక్కలు నాటుకోవడానికి,కలుపు తీసే యంత్రాలను తీసుకోవడానికి సబ్సిడీలందించారు. ఎరువులు, పురుగుల మందులను ఉచితంగా అందించడమే కాక పండించిన గూళ్లకు ఇన్సెంటివ్‌గా రూ.50 ఇచ్చేవారన్నారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టు రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు.సబ్సిడీలను కొనసాగించడంలోనూ, ఇన్సెంటివ్ ఇవ్వడంలోనూ శ్రద్ధ పెట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10నెలలు గడుస్తున్న తరుణంలో పట్టు రైతులకు గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాలను మళ్లీ ప్రారంభించాలి. పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను కూడా మంజూరు చేయాలి.

- అమరనాథ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే

గురుకులంలో మెరుగైన వసతులు కల్పించండి



పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురంలో 23 ఏళ్ల కిందట ప్రారంభమైన అంబేడ్కర్ గురుకుల పాఠశాల.. గడిచిన ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైంది. భద్రత, అవసరాల విషయంలో 540 మంది విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాల, హాస్టల్ సదుపాయం ఉంది. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లను అందుబాటులోకి తీసుకురావాలి. ఇటీవల వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. బాలికల భద్రత దృష్ట్యా ప్రహరీని వెంటనే నిర్మించాలి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. అదనంగా నాలుగు తరగతి గదులను నిర్మించాలి. ఇంటర్నెట్‌ను ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలి. బోధన సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

తగ్గిన స్థిరాస్తి జోరు

- లక్ష్యం రూ.221.88 కోట్లు
- ఆదాయం రూ.136.44 కోట్లు
- మిగిలిన నెలరోజుల్లో రూ.85.44 కోట్లు సాధ్యమా...?



చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకోసం వేచివున్న కక్షిదారులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు కామధేనువు లాంటి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అంతంత మాత్రంగా ఉంది.2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యంలో ఇప్పటి వరకు 69.10 శాతం మాత్రమే వసూలు కాగా, మిగిలిన మార్చి నెలాంతానికి మిగతా 30.9 శాతం రాబడి వస్తుందో రాదో అని అధికారులు హైరానా పడుతున్నారు. పలు పట్టణ ప్రాంతాల్లో ప్లాట్ల ధరలు ఆకాశాన్ని అంటుతుండడం ఇందుకు కారణమని పలువురు విశ్లేషిస్తున్నారు. మున్సిపాలిటీ ప్రాంతాల పరిధిలో వున్న గ్రామాల్లో పొలాల ధరలు పెరుగుతున్నాయి.కానీ రిజిస్ట్రేషన్లు జరగడంలేదు.గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో స్థిరాస్తి వ్యాపారం కుదేలయ్యింది. మరోవైపు రిజిస్ట్రేషన్ ఛార్జీలు విపరీతంగా పెరగడం వల్ల భారం మోయలేక కొందరు ఒప్పందాలతోనే సరిపెట్టుకుంటున్నారు. ఆస్తి బదలాయింపునకు ఒప్పందం చట్టబద్ధత కాకపోయినా రిజిస్ట్రేషన్ ఛార్జీలు భరించలేక కొందరు వాయిదా వేసుకుంటున్నారు.

ఫలితంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య అనుకున్న మేరకు నమోదు కాలేదు. ఇటీవల తనఖా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. భూములు, భవనాలు తనఖాలు పెట్టి కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు.ఈ కారణంగా తనఖా రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ల విడుదలకు కొంత ఆదాయం లభిస్తోంది. డిసెంబరు నెల నుంచి కొంతమేర ఆదాయం పెరుగుతున్నా, మిగిలిన నెలరోజుల్లో గడువు ముగిసే లోగా లక్ష్యసాధన కష్టమేనని అధికారులు అంటున్నారు.

● చివరిస్థానంలో బంగారుపాళ్యం

చిత్తూరు జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎస్ఆర్ కార్యాలయాల్లో ఈసారి పెద్దగా లక్ష్యాలు నమోదు కాలేదు. ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.221.88 కోట్లుగా నిర్దేశించింది. ఫిబ్రవరి నెలనాటికి రూ.197.47 కోట్ల లక్ష్యంలో రూ.136.44 కోట్లు మాత్రమే (69.10శాతం) వసూలైంది.పలమనేరు 78.19 శాతం, కార్వేటినగరం 77.82 శాతం, కుప్పం 70.51 శాతం కలెక్షన్లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బంగారుపాళ్యం అతితక్కువగా 56.63శాతంతో చివరిస్థానంలో నిలిచింది.

జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, (ఫిబ్రవరి నెలవరకు) సాధించిన ప్రగతి ఇలా.... (రూ.కోట్లలో)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	ఆదాయ లక్ష్యం	ఫిబ్రవరి వరకు	రాబడి శాతం	డాక్యుమెంట్ల సంఖ్య
బంగారుపాళ్యం	11.73	5.91	56.63	3132
కుప్పం	25.69	16.12	70.51	10,691
పలమనేరు	33.78	23.51	78.19	9,489
పుంగనూరు	32.76	17.78	61.0	8,129
చిత్తూరు (ఆర్వో)	75.77	47.14	69.91	11,510
కార్వేటినగరం	9.70	6.72	77.82	4,747
నగరి	16.33	9.86	67.84	3,018
చిత్తూరు రూరల్	16.08	9.37	65.48	4,287
మొత్తం	221.88	136.44	69.10	55,003

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటు

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు.కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో జిల్లా పరిశ్రమలు - ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం బుధవారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జరిగింది.ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన మానవ వనరులను సమకూర్చి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పరిశ్రమల, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమ నిర్వహణలో భాగంగా ఇప్పటివరకు 45,119 యూనిట్ల సర్వే పూర్తయ్యిందని, మిగతా సర్వేను ఈనెల 15వతేదీ లోగా పూర్తిచేయాలన్నారు. గండ్రాజుపల్లె పారిశ్రామికవాడలో దొంగతనాలు విరివిగా జరుగుతున్నాయని అక్కడి పారిశ్రామికవేత్తలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన ఆయన ఎస్పీతో ఫోన్ ద్వారా చర్చించారు. అక్కడ అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, శిక్షణ పొందినవారికి ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా పండ్ల సమాఖ్య సభ్యుడు గోవర్దన్ బాబి కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం వెంకటరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, డీపీవో సుధాకరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కత్తి దాడిలో గాయపడ్డ ప్రేమజంటకు ఎస్పీ పరామర్శ



బాధితులను పరామర్శించి వస్తున్న ఎస్పీ మణికంఠ

కుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సొంత కూతురితో పాటు నలుగురు వ్యక్తులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డ గుడుపల్లె మండలం అగరం పంచాయతీ, అగరం కొత్తపల్లెకు చెందిన శివమూర్తిని వెంటనే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చెప్పారు. ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న కుమార్తె కౌసల్య (21), ఆమె భర్త చంద్రశేఖర్(25)లపై బుధవారం ఉదయం శివమూర్తి కత్తితో దాడికి తెగబడిన విషయం కలకలం రేపింది.ఈ దాడిలో ప్రేమ వివాహం విషయమై మాట్లాడ్డానికి వచ్చిన మధ్యవర్తులు రమేశ్, సీతారామప్ప కూడా గాయపడ్డారు. దాడి అనంతరం శివమూర్తి పారిపోగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ఈ నేపథ్యంలో కుప్పంలో దాడి జరిగిన ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంతాన్ని ఎస్పీ మణికంఠ బుధవారం సాయంత్రం పరిశీలించారు. బాధితులు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నలుగురిపై శివమూర్తి కత్తితో దాడి చేశారని, వారిలో తీవ్రంగా గాయపడినవారికి వెంటనే ఆపరేషన్ చేశారన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారందరూ ప్రస్తుతం క్షేమంగా ఉన్నారన్నారు. పరారీలో ఉన్న శివమూర్తిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.

సీఐఐ తిరుపతి చైర్మన్‌గా జగన్నాథ్



జగన్నాథ్ అనిరుధ్



రాజేంద్రన్

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తిరుపతి జోన్ చైర్మన్‌గా గంగవరం మండలం గండ్రాజుపల్లెలో వున్న స్విచ్ గేర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథ్ అనిరుధ్ నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా కజారియా సిరామిక్స్ శ్రీకాళహస్తి ప్లాంట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్పీ రాజేంద్రన్ నియమితులయ్యారు. తిరుపతిలో బుధవారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ ప్రకటించారు.

వేడుకగా మొగిలీశ్వరుడి తెప్పోత్సవం



తెప్పపై పార్వతీపరమేశ్వరులు



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ఉభయదారులు

బంగారుపాళ్యం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం రాత్రి స్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.ఉదయం మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అలంకార మండపంలో ప్రధాన అర్చకులు గంగాధర గురుకుల్ ఆధ్వర్యంలో స్వామి,అమ్మవారి ఉత్సవర్లను సుగంధభరితమైన పూలతో, స్వర్ణాభరణాలతో అలంకరించారు.మేళతాళాలు, అర్చకుల వేదమంత్రాల మధ్య మాడవీధుల గుండా పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. తెప్పపై అధిష్ఠింపజేసి ఐదు ప్రదక్షిణలు చేయించారు.బంగారుపాళ్యం ఎస్సీసీ నాయుడు కాలనీకి చెందిన బేబి,మాధవనాయుడు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్,ఈవో మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి పట్ల అలసత్వం వద్దు

పనులు చేపట్టని ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణ పట్ల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అలసత్వం చూపించవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు.కలెక్టరేట్ నుంచి బుధవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు,ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈఈ, ఈవోపీఆర్డీలతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.నీటి ఎద్దడి నివారణకు 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చుచేయాలని, బిల్లులు జిల్లాపరిషత్‌కు సమర్పించాలన్నారు. ఇంతవరకూ నిధులు ఖర్చుచేయని ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సమావేశం నిర్వహించి సమీక్షిస్తే కానీ పనులు చేయరా అని వారిపై అసహనం వ్యక్తం చేశారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.28

సహరి (శుక్రవారం) : 5.06

రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌కు డిగ్రీ విద్యార్థి బలి

● మృతుడి తమ్ముడు అపస్మారక స్థితిలోకి



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

పుత్తూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ద్విచక్రవాహనాన్ని రాంగ్‌సైడ్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా అతడి సోదరుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు.సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు...పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ కుమారులు మునికుమార్, రవిశేఖర్(18) పుత్తూరులోని వేదవ్యాస కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు.బుధవారం కళాశాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.10 నిమిషాల్లో కళాశాలకు చేరుకోవాల్సిన అన్నదమ్ములను పిల్లారిపట్టు సమీపంలోని వందన వైన్స్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవిశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా,మునికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.రవిశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మునికుమార్‌ను మెరుగైన వైద్యం కోసం రేణిగుంట సమీపంలోని అమర ఆస్పత్రికి తరలించారు.ప్రమాద సమాచారం తెలుసుకుని వచ్చిన మంజునాథ్ దంపతులు చిన్న కొడుకు రవిశేఖర్ మృతదేహం వద్ద భోరున విలపించడం చూపరులను కంట తడి పెట్టించింది.పెద్ద కొడుకు మునికుమార్ పరిస్థితి కూడా విషమంగా మారడంతో వారు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

వ్యతిరేక దిశగా వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్

పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో వస్తూ విద్యార్థులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాద ప్రాంతానికి సమీపంలో ఉన్న క్వారీ నుంచి ముగ్గురాయి తీసుకుని వడమాలపేట వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిపై వ్యతిరేక దిశగా డ్రైవర్ గోపి ట్రాక్టర్‌ను నడిపాడు.అతడి వయస్సు 18 సంవత్సరాలు, లైసెన్సు కూడా లేదని సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి పరారవడంతో పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. మరోవైపు కళాశాలకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడేవారని చూసినవారు చెబుతున్నారు.



మృతి చెందిన రవిశేఖర్, అపస్మారక స్థితిలో మునికుమార్



జెర్రిపోతు

పట్టుబడిన నాగుపాము

వామ్మో!

ఒకే రోజు ఆందోళన పెట్టిన నాగుపాము, జెర్రిపోతు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో బుధవారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. గాలిగోపురం వద్ద జనసంచారంలోకి వచ్చిన నాగుపాము భక్తులను ఆందోళన పెట్టింది. సమాచారంతో భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దానిని బంధించారు. అలాగే తిరుమల సేవా సదన్‌కు సమీపంలో ఉన్న గార్డెన్‌లోనూ ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు. ఈ పాములను అడవిలో విడిచిపెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. శ్రీపాదరాజ మఠాధిపతి సుజయ నిధితీర్థ స్వామిజీ, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్కే రోజా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







సుజయనిధితీర్థ స్వామిజీ - ఆర్కే రోజా - సబితా ఇంద్రారెడ్డి


సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,861

తలనీలాలు సమర్పించినవారు: 19,639



గురుకులం పిలుస్తోంది

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది పాఠశాలల్లో 600 సీట్లున్నాయి. బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ఈనెల 15లోగా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలల్లో 600 సీట్లు

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈనెల 15

ఏప్రిల్ 25, 27, 28 తేదీల్లో ప్రవేశ పరీక్షలు

పాఠశాలలు - సీట్లు

ప్రాంతం	కేటగిరీ	కేటాయించిన సీట్లు
తిరుపతి	బాలికలు	80
పీలేరు	బాలికలు	80
కలికిరి	బాలికలు	80
పెద్దపంజాణి	బాలికలు	40
పులిచెర్ల	బాలికలు	40
సదుం	బాలురు	80
సత్యవేడు	బాలురు	80
ఐతేపల్లి (తిరుపతి)	బాలురు	40
అంగళ్లు	బాలురు	40
కుప్పం	బాలురు	40



తిరుపతిలోని బీసీ గురుకుల పాఠశాల భవనం

అర్హులు ఎవరంటే?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులకు 11, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదు. పాత జిల్లాల ప్రకారం గురుకుల్లో అడ్మిషన్లు ఉంటాయి.

దరఖాస్తు విధానం

అర్హులు ఆన్‌లైన్‌లో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి https://mjapapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, కేటగిరీ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు. ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 25న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.

సదుపాయాలు : ఉచిత వసతి, పౌష్టికాహారం, మూడు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు లాంటివి ప్రభుత్వం సమకూర్చుతుంది. కాస్మొటిక్ చార్జీలను కూడా చెల్లిస్తుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు. యోగా, మ్యూజిక్, ఆర్ట్‌లోనూ శిక్షణ ఇస్తారు.

అంబేడ్కర్ గురుకులాలకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

ఉమ్మడి జిల్లాలోని 15 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సర ప్రవేశానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించనున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు చదువుకోవచ్చు. వసతి, భోజనం, పుస్తకాలు సహా అన్నీ ఉచితమే.

అర్హతలు:

- 5వ తరగతిలో ప్రవేశం పొందగోరు ఎస్సీ, ఎస్టీ బాలికలు 2012 సెప్టెంబరు 1- 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, బీసీ సీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1వతేదీ -2016 ఆగస్టు 31 మధ్య జన్మించినవారై ఉండాలి.
- ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు అర్హులు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షకు మించరాదు.

పాఠశాలలు - సీట్లు:

రామకుప్పం, బి. కొత్తకోట, పూతలపట్టు, కుప్పం (విజయపురం)లో బాలుర పాఠశాలలు కాగా శ్రీకాళహస్తి, చిత్తూరు, పీలేరు, బురకాయలకోట, పలమనేరు, సత్యవేడు, పుత్తూరు, మదనపల్లు, కుప్పం, వాల్మీకిపురం, జీడీనెల్లూరుల్లో బాలికల పాఠశాలలున్నాయి. తరగతికి 80 చొప్పున సీట్లు ఉంటాయి. జూనియర్ ఇంటర్‌లో 40, సీనియర్ ఇంటర్‌లో 40 సీట్లున్నాయి.

శాస్త్రోక్తంగా వేద పారాయణం





వేద పారాయణం చేస్తున్న పండితులు - ధూర్జటి కళాప్రాంగణంలో పారాయణం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకొని బుధవారం ఉదయం వేద పారాయణ సభ శాస్త్రోక్తంగా జరిగింది. ఉత్సవాల్లో చివరి రోజు వేద సభ జరగడం ఆలయ సంప్రదాయం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రముఖ దేవాలయాల నుంచి 100మంది ఘనాపాటిలైన వేద పండితులు ఆలయానికి విచ్చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఋగ్వేదం, సామవేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం బృందాలుగా పండితులు ఆశీనులయ్యారు. అనంతరం వేదాలను పఠించారు. వేద ఘోషలో ధ్వనించిన దివ్య శబ్ద తరంగాలతో వాయులింగేశ్వర క్షేత్రంలో భక్తులు పరవశించారు. అదే విధంగా ధూర్జటి కళా ప్రాంగణంలో కూడా వేదఘోష జరిగింది. అనంతరం ఈవో బాపిరెడ్డికి వేద పండితులు ఆశీర్వాదం అందజేశారు. వేద సభలో పాల్గొన్న పండితులకు ప్రత్యేక దర్శన ఏర్పాటు తర్వాత ఆలయ లాంఛనాలతో ఘనంగా సత్కరించారు. అలాగే స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం

● మంత్రుల సమీక్షలు సఫలీకృతం ● అధికారుల సమన్వయంపై భక్తుల సంతృప్తి

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. గత నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాల పర్యవేక్షణ కోసం హోం మంత్రి అనిత, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కమిటీ ఏర్పాటు చేయించారు. మంత్రులు స్వయంగా శ్రీకాళహస్తికి చేరుకుని ఎమ్మెల్యే సుధీర్‌తో పాటు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అలాగే కలెక్టర్ పలుమార్లు శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఎప్పటికపుడు సూచనలు చేశారు. ఉత్సవాల దృష్ట్యా నెల రోజుల ముందే సన్నిధి వీధి, రాజగోపురం వద్ద రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే సుధీర్ చేయించారు. అలాగే తిరుపతి రోడ్డులో మరమ్మతులు చేయడం, గిరిప్రదక్షిణ సాగే పట్టణంలోని తెలుగుగంగ కాలనీరోడ్డును బాగుచేయడంతో ఉత్సవాల సందర్భంగా రాకపోకలకు ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయి. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పలుమార్లు శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఆయన స్వయంగా పట్టణ నలుమూలలో సంచరించి శివారు ప్రాంతాల్లో 11 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య భక్తులకు దూరమైంది.



ఆలయంలో భక్తుల రద్దీ

ఇక ఎస్పీ, ఈవో బాపిరెడ్డి మహాశివరాత్రి రోజున స్వయంగా క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సామాన్య భక్తులు త్వరితగతిన దర్శనం పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఉచిత లడ్డూ ప్రసాదం వితరణ, మహిళలకు వాయనం ఇవ్వడం భక్తులను సంతోష పరిచింది. ఈ యేడాది శివరాత్రి రోజున పెద్దఎత్తున ప్రముఖులు ముక్కంటి ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక ధ్వజావరోహణం రోజున తప్ప మిగతావన్నీ సమయపాలనతో సాగడంపై భక్తులు హర్షించారు. మౌలిక వసతులు కూడా భక్తులకు సంవృద్ధిగా ఏర్పాటు చేశారు. మొత్తంగా మంత్రుల సమీక్షలు ఉత్సవాల విజయవంతం కావడానికి బాటలు వేశాయి.

ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.35 లక్షల విలువైన బంగారు, 2116 గ్రాముల వెండి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను తిరుపతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం శివజ్యోతినగర్‌కు చెందిన ముత్తాల అరుణ్, డేరంగుల జగదీష్, ముత్తాల తేజస్, బాలాయపల్లి మండలం వెంగమాంబపురానికి చెందిన అక్కుర్తి నవీన్, అక్కుర్తి పెంచలయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంకు చెందిన పి.విఘ్నేష్, బీటీఆర్ కాలనీకి చెందిన లోకనాథరెడ్డి స్నేహితులు. తొలినుంచీ ఈజీ మనీకి అలవాటు పడ్డారు. మద్యానికి బానిసయ్యారు. చెడు అలవాట్లు అలవడటంతో డబ్బు కోసం ఇంటి దొంగతనాల వైపు అడుగేశారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కీలకం. కొన్నేళ్లుగా తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలకు పాల్పడేవారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని పగటి పూట రెక్కీ నిర్వహించేవారు. రాత్రిళ్ల దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో తిరుపతి రూరల్ తిరుచానూరులోని శంకర్ నాయుడు కాలనీలో ఉంటున్న అంబుజ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దీనిని గమనించిన ఈ ఏడుగురు.. ఓ రాత్రి వేళ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువా, అల్మారాల్లోని అలమరాల్లో వున్న బంగారు నగలు, డబ్బులు, వెండి వస్తువులు అపహరించుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుచానూరు సీఐ సునీల్ అప్పట్లో కేసు నమోదు చేశారు.

నిఘా ఉంచి.. పట్టుకుని

ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, అరుణ, జగన్నాథ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది ప్రభాకర్, ప్రసాద్, ఎల్‌బీ ప్రసాద్ బృందాలుగా నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో సీఐ సునీల్‌కుమార్ బృందం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముళ్ళపూడి క్రాస్ వద్ద అనుమానంగా తిరుగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు శంకర్‌నాయుడు కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. వీరి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన 501 గ్రాముల బంగారు నగలు, 2116 గ్రాముల వెండి ఆభరణాలు, కారు, ఆటో, స్కూటరును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని ముత్తాల అరుణ్‌పై 29 కేసులు, అక్కుర్తి నవీన్‌పై 11 కేసులు, పెంచలయ్యపై 18 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. ఈ ముఠాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.



దొంగల అరెస్టును చూపి.. మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నేలపట్టులో ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఎకో సెన్సిటివ్ జోన్ కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దొరవారి సత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నుంచి 2కి.మీ. విస్తీర్ణాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అక్కరపాకు, మైలంగం, ముచ్చలగుంట, నెలబల్లి, నెల్లూరుపల్లి, వెంగమాంబపురం, ఏకొల్లు, నేలపట్టు తదితర రెవెన్యూ గ్రామాల్లో ఇది ఉంటుందని వెల్లడించారు. పర్యావరణంతో పాటు టూరిజం, వ్యవసాయ, ఉద్యానవనం, మత్స్యశాఖ చేపట్టాల్సిన అంశాలపై చర్చించి మ్యాప్ రూపొందించాలని సూచించారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఈ మాస్టర్ ప్లాన్‌లో అధికారులందరూ భాగస్వాములు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట డివిజన్ డీఎఫ్‌వో హారిక, అడిషనల్ డీఎఫ్‌వో నాగభూషణ్, అధికారులు జయచంద్ర, వినోద్, సౌజన్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

తమిళనాడుకు చెందిన మహిళ మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): బైకుపై వేగంగా వస్తూ అదుపు చేయలేకపోయాడు. కొండకు నడిచి వెళుతున్న భక్తులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తమిళనాడుకు చెందిన వీరమ్మాల్(60) మృతిచెందారు. ఈ ఘటన బుధవారం తిరుపతి నగరం ఇస్కాన్ ఆలయం వద్ద చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ అజిత తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన చంద్రశేఖర్ బైకుపై అన్నారావు సర్కిల్ మీదుగా ఇస్కాన్ రోడ్డు వైపు వెళుతున్నాడు. అదే సమయంలో తమిళనాడు రాష్ట్రం కాంచీపురం తాలూకా నల్లూరు గ్రామానికి చెందిన వీరమ్మాల్(60) కుటుంబ సభ్యులతో కలిసి నడుచుకుంటూ తిరుమల కొండకు వెళుతున్నారు. ఇస్కాన్ ఆలయం వద్దకు వీరు వెళుతుండగా.. బైకుపై వేగంగా వెళుతున్న చంద్రశేఖర్ అదుపు తప్పి వీరమ్మాల్‌ను ఢీకొన్నాడు. కింద పడటంతో ఆమె తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



ప్యాసింజర్ రైళ్ల రద్దు 31 వరకు కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కుంభమేళా కోసం రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లలో కొన్నింటిని ఈనెల 8 నుంచి 31వ తేదీ వరకు, మరికొన్నింటిని 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. తిరుపతి-కదిరి దేవరపల్లి (57405-57406), తిరుపతి-గుంతకల్లు(57403-57404), తిరుపతి-హుబ్లీ (57401-57402) మధ్య రాకపోకలు సాగించే రైళ్లను ఈనెల 31 వరకు, తిరుపతి-కాట్పాడి మధ్య నడిచే ఆరు డెము ప్యాసింజర్లను ఈనెల 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నామని వివరించారు.



అపాచీ పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంపై పరిశ్రమలు సైతం వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం తడలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం హెల్మెట్ ధరించని ఉద్యోగులను లోనికి అనుమతించేది లేదంటూ నిబంధన విధించిన విషయం తెలిసిందే. తాజాగా మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమ ఈనెల 17నుంచి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంలో విధులకు వచ్చే ఉద్యోగులను లోనికి అనుమతించేది లేదంటూ బోర్డు ఏర్పాటు చేసింది.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 540 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 540 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆంగ్ల భాష పరీక్ష జరిగింది. 29,131 మంది విద్యార్థులకుగాను 28,591 మంది పరీక్షలు రాశారు. 540 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

ఎస్వీయూ దూరవిద్య పీజీ నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ దూరవిద్యా పీజీ నోటిఫికేషన్ విడుదలైంది. 2025 సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్ బాబు తదితరులు బుధవారం విడుదల చేశారు. 17 పీజీ, 2 డిప్లొమో కోర్సులకు ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్‌సి కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువరించామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచీ 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూసీడీఓఈ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కోరారు. సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ వరదరాజన్ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన కార్పొరేషన్ రాయితీ రుణాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు

చిత్తూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో బీసీ, ఓబీసీ, కాపు కార్పొరేషన్ రాయితీ రుణాల మంజూరు కోసం నగరపాలక కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం 26 నుంచి 50 వార్డుల పరిధిలోని లబ్ధిదారులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల ప్రకారం ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. నగరపాలక పరిధిలోని 38బ్యాంకుబ్రాంచీల అధికారులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. మంగళ, బుధవారం రెండురోజులపాటు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మొత్తం 1448 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్ నరసింహప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

3డీ ప్రింటింగ్‌తో విప్లవాత్మక మార్పులు

● అపోలో వర్సిటీ వీసీ వినోద్ భట్



3డీ ప్రింటింగ్‌పై విద్యార్థులకు డెమో ఇస్తున్న ఐఐటీ ప్రొఫెసర్లు

చిత్తూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో 3డీ ప్రింటింగ్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని అపోలో యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ వినోద్ భట్ అన్నారు. బుధవారం చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో తిరుపతి ఐఐటీ, అపోలో వైద్య కళాశాల సంయుక్తంగా కృత్రిమ అవయవాల 3డీ ప్రింటింగ్ విధాన ప్రక్రియపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3డీ ప్రింటింగ్ ద్వారా అతి తక్కువ సమయంలో అధిక కచ్చితత్వంతో కృత్రిమ అవయవాల తయారీ జరుగుతుందన్నారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. అనంతరం ఐఐటీ తిరుపతి నుంచి డాక్టర్ రవిశంకర్ 3డీ ప్రింటింగ్‌పై విద్యార్థులకు లైవ్ డెమో ఇచ్చారు. 3డీ ప్రింటింగ్‌తో తయారు చేసిన కృత్రిమ అవయవాలను ప్రదర్శించారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్లు సుభద్ర, సత్యనారాయణ, వైద్య విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ఎస్వీయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పద్మావతి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ వి.పద్మావతి నియమితులయ్యారు. ఇప్పటివరకూ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కేటీ రామకృష్ణారెడ్డి పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో పద్మావతిని నియమిస్తూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె రెండేళ్ల పాటు ఈ స్థానంలో కొనసాగనున్నారు. కాగా, హెటిరోసైక్లిక్ కెమిస్ట్రీ ప్రత్యేకాంశంగా వర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పద్మావతి మూడు దశాబ్దాలకు పైగా బోధన, పరిశోధన అనుభవాన్ని గడించారు. ఆమె పర్యవేక్షణలో 33 పీహెచ్‌డీలు, 13 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. 10 రీసెర్చ్ ప్రాజెక్టులు నిర్వహించారు. 101 రీసెర్చ్ ఆర్టికల్స్ పబ్లిష్ అయ్యాయి. కెమిస్ట్రీ హెడ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ బీఓఎస్ ఛైర్‌పర్సన్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, సైన్స్ కాలేజీ వైస్-ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. 2022లో ఉత్తమ అధ్యాపక అవార్డు పొందారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

8 నుంచి సీఐటీయూ 'సీమ' స్థాయి వర్క్‌షాపు

తిరుపతి(ఆటోనగర్) మార్చి5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సీఐటీయూ రాయలసీమ స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థాపకులు బాలానందన్ శత జయంతి సభ అనంతరం వర్క్‌షాపు ప్రారంభమవుతుందని, రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వరరావు, సీహెచ్ నరసింగరావు పాల్గొంటారని తెలిపారు.

24న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

● వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న బోర్డు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం ఈనెల 24వ తేదీన జరగనుంది. తొలుత ఈనెల 8వ తేదీన సమావేశాన్ని నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ పరిపాలన కారణాలతో 24వ తేదీకి వాయిదా వేశారు.ఆరోజున ప్రధానంగా 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతోపాటు పలుముఖ్యమైన అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు.

తెలుగు గంగ సీఈగా వరప్రసాద్

పదోన్నతిపై ఎస్ఈ మల్లికార్జునరెడ్డి బదిలీ

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుగా ఎంఎల్ఎన్ వరప్రసాద్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ అనంతపురం హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎస్ఈగా పనిచేస్తున్న ఆయనకు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తిరుపతికి బదిలీ చేసింది. అలాగే తిరుపతిలో తెలుగు గంగ, గాలేరు-నగరి ప్రాజెక్టుల ఎస్ఈగా పనిచేస్తున్న ఎం.మల్లికార్జునరెడ్డిని పదోన్నతిపై విజయవాడలోని హెచ్ఆర్‌డీ విభాగానికి చీఫ్ ఇంజనీర్‌గా నియమించింది. బుధవారం ఈ మేరకు సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

● ఈ- సైకిల్

పర్యావరణ ప్రియం.. చిరు వ్యాపార హితం

● కుప్పంలో పొదుపు సంఘాలకు నేడు 300 సైకిళ్ల పంపిణీ



కుప్పం వెలుగు కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఈ- సైకిళ్లు

కుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పెట్రో వాహనాల కారణంగా పెరిగిపోతున్న కాలుష్య భూతం నివారణకు రూపొందించిందే ఎలక్ట్రిక్ వాహనం. దీనికి చిరు వ్యాపారుల ప్రయోజనాన్ని అనుసంధించిన ప్రభుత్వం ఈ-సైకిల్‌ను రంగంమీదికి తీసుకువచ్చింది. వెలుగు ప్రాజెక్ట్ మండల మహిళా సమాఖ్య ద్వారా పొదుపు సంఘాలు నడుపుతున్న చిరు వ్యాపారాలకు ఊతంగా ఈ సైకిళ్లు అందించే పైలట్ ప్రాజెక్టుకు కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. కడా పీడీ ద్వారా నియోజకవర్గంలో తొలి విడతగా 300 ఈ- సైకిళ్లను గురువారం పంపిణీ చేయనున్నారు. కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేసే సభలో తొలి విడతగా 300 ఈ- సైకిళ్లను పంపిణీ చేస్తారు.క్షేత్రస్థాయిలో వీటిని వినియోగించిన తర్వాత ఫలితాలను బట్టి రెండో విడతలో మరో 3 వేల సైకిళ్లను తెప్పిస్తామని కడా పీడీ వికాస్ మర్మత్, కుప్పం వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ చెప్పారు.

అతి తక్కువ ఖర్చుతో

ఈ- సైకిల్ పర్యావరణ హితమే కాదు.. అతి తక్కువ ఖర్చుతో వినియోగించేవారికి లాభం చేకూర్చే వాహనం కూడా. విద్యుత్తు ఛార్జింగ్ బ్యాటరీతో నడిచే ఈ సైకిల్, ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే సునాయాసంగా 50 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. 120 కిలోల వరకు బరువు మోయగలిగే సామర్థ్యం ఉంది.మూడు గంటలపాటు ఛార్జింగ్ పెడితే కేవలం 1.5 యూనిట్స్ మాత్రమే వినియోగం అవుతుంది. ప్రస్తుత కరెంటు ఛార్జీ ప్రకారం ఈమేరకు కేవలం 15 రూపాయలు మాత్రమే వ్యయమవుతుంది. అంటే రూ.15 వ్యయంతో 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్న మాట. పైగా కాలుష్య రహిత వాహనం.

చిరు వ్యాపారులకు లాభం

వెలుగు ప్రాజెక్ట్ మండల సమాఖ్య ద్వారా పొదుపు సంఘాల్లో చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు ఈ సైకిళ్లను ఉద్దేశించారు. ముందువైపు, వెనుకవైపు ఉన్న రెండు రకాల క్యారేజీల ద్వారా చిన్నచిన్న సరుకులను హోల్‌సేల్ వ్యాపారులనుంచి ఈ- సైకిల్ ద్వారా తీసుకు వచ్చే వెసులుబాటు ఉంది. ఏకంగా 120 కిలోల సామర్థ్యం ఉండడంతో అంత బరువు కలిగిన సరుకులు తెచ్చుకొని చిన్నపాటి వ్యాపారులు తమ దుకాణాల్లో పెట్టుకోవచ్చు. ఆటోలకు లేదా ద్విచక్ర వాహనాలకు రవాణాకోసం పెట్టే వేల రూపాయల వ్యయం తగ్గుతుంది. రూ.40 వేలు విలువ చేసే ఈ-సైకిల్‌ను కేవలం రూ.9 వేలకే ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తోంది.

రేషన్ డీలర్లకు కమీషన్ రూ.2.03 కోట్లు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న 2905 చౌకదుకాణ డీలర్లకు కమీషన్ రూపేణ రూ.2.03 కోట్లను ప్రభుత్వం బుధవారం విడుదల చేసిందని జిల్లా ఎఫ్‌పీ షాపు డీలర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. 2015 నుంచి 2022 వరకు మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలకు డీలర్ల ద్వారా రేషన్ బియ్యం సరఫరా చేసినందుకు చెల్లించాల్సిన కమీషన్ మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. డీలర్లు తమ ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా నెంబరు తెలిపే వివరాలతో పాటు ఎఫ్‌పీ షాపు నెంబరును సమీప మండల తహసీల్దార్లకు అందజేయాలి. ఆయన పరిశీలించి డీఎస్వో కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుండి కమీషన్ నిధులు డీలర్ల ఖాతాలకు జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు తమ సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

వెటర్నరీ వర్సిటీ గేట్లకు తాళం

● రోజంతా వీసీ, అధికారులు, ఉద్యోగులు రోడ్డుపైనే పడిగాపులు

● మెస్‌లు, హాస్టళ్ల మూసివేత నిర్ణయంతో విద్యార్థుల సమ్మె ఉధృతం





గేట్లకు తాళాలు వేసి, లోపల నిరసన కొనసాగిస్తున్న విద్యార్థులు - ప్రధాన గేటు వద్ద వర్సిటీ వీసీ జేవీ రమణ, ఏఎస్పీ రవిమనోహరాచారి చర్చలు

తిరుపతి రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. వర్సిటీ ప్రధాన గేట్లకు తాళాలేయడంతో వీసీ సహా అధికారులు, ఉద్యోగులంతా రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది. 31రోజులుగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వర్సిటీకి అనుబంధంగా నడిచే మెస్‌లు, హాస్టళ్లను మూసివేస్తూ అధికారులు నోటీసు జారీచేశారు. బుధవారం ఉదయం మెస్‌లను మూసేసినట్లు చెప్పగానే.. వర్సిటీలోకి ప్రవేశించే రెండు ప్రధాన మార్గాలలోని గేట్లకు విద్యార్థులు తాళాలేశారు. తమ లగేజీబ్యాగులు, ప్లేట్లని ముందు పెట్టుకుని లోపలవైపు నిరసన కొనసాగించారు. దీంతో ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బంది బయట రోడ్డుపైనే నిలబడ్డారు. గేట్లు మూసే అధికారం ఎవరికీలేదని, ఉద్యోగులను లోపలకు అనుమతించాలని ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ సీఐ రామయ్య, సిబ్బంది కోరారు. మెస్‌లను మూసేసి తమను అన్యాయంగా రోడ్డుపైకి చేర్చారని, న్యాయం జరిగేవరకు గేట్లు తెరిచేది లేదని విద్యార్థులు భీష్మించారు. అధికారులు, ప్రొఫెసర్లతో కలసి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ విద్యార్థులతో మాట్లాడారు. స్టైఫండ్ పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికెళ్లగా సానుకూలంగా ఉందని వివరించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే మెస్, హాస్టళ్లను ఎందుకు మూసేశారని విద్యార్థులు ప్రశ్నించారు. ఎంతకూ విద్యార్థులు గేట్లు తెరవకపోవడంతో ప్రత్యేకబలగాలతో కలిసి పోలీసులు వర్సిటీ గోడపై నుంచి లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. విద్యార్థులు అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం వరకూ రోడ్డుపై, ఫ్లైఓవర్‌కింద వేచి చూసిన ఉద్యోగులు ఆపై వెనుదిరిగారు. కొందరు ఉద్యోగులు వ్యవసాయ కళాశాల మీదుగా వర్సిటీలోకి ప్రవేశించే మార్గానికి చేరుకోగా అక్కడా గేట్లకు తాళం వేసి ఉండటంతో వెళ్లలేకపోయారు.

ఏఎస్పీ సమక్షంలో చర్చలు

వెటర్నరీ వర్సిటీ గేటు వద్దకు ఏఎస్పీ రవి మనోహరాచారి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. చివరకు విద్యార్థులు మూడు ప్రధాన డిమాండ్లను పోలీసుల దృష్టికి తెచ్చారు. ఆయన వీసీని ప్రధానగేటు వద్దకు పిలిపించి విద్యార్థులతో మాట్లాడించారు. హాస్టళ్లు, మెస్‌ల మూసివేత నిర్ణయం వెనక్కితీసుకోవాలని, తమను ప్రభుత్వ పెద్దల వద్దకు చర్చకు తీసుకువెళ్లాలని, సమస్య పరిష్కారమయ్యేవరకు శాంతియుతంగా సమ్మె కొనసాగించనివ్వాలని కోరారు. వీసీ సానుకూలంగా స్పందించడంతో గేట్లు తెరిచారు. వీసీ మీడియాతో మాట్లాడుతూ.. అకడమిక్ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఇది చాలా విలువైన సమయమన్నారు. సమ్మె విరమించి తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు. స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.

2026 @ స్వర్ణ కుప్పం!

స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలు విధించుకుని ముందుకు ● కడా పీడీ వికాస్ మర్మత్



కుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ కుప్పం కల 2026 డిసెంబరుకల్లా సాకారం అవుతుందని కడా పీడీ వికాస్ మర్మత్ చెప్పారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలు విధించుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రజల్లో వంద శాతం సంతృప్తి దిశగా ఇప్పటికే అడుగులు పడుతున్నాయని, ఆ మేరకు కుప్పం నియోజకవర్గంలో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.జీరో పావర్టీ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 14 వేల పక్కా గృహాలు, కుప్పం అర్బన్‌లో 900 గృహాల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు.గండికోటనుంచి ప్రత్యేక పైపులైన్ తీసుకు రావడం ద్వారా ఇంటింటికీ తాగునీటి పైపులైన్ వేస్తామన్నారు. 10వేల మరుగుదొడ్ల నిర్మాణాన్ని 3 నెలల్లో పూర్తిచేస్తామని,దీపం పథకం 2.0 ద్వారా 4700 వంట గ్యాస్ కనెక్షన్లను ఇస్తామన్నారు.ఏడాది కాలంలో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.నెలలోగా 1387మంది విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాలు పంపిణీ చేస్తామన్నారు.కొత్త పరిశ్రమల ద్వారా సుమారు 20 వేలకు పైగా ఉద్యోగాల కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.హంద్రీ-నీవా లైనింగ్ పనులు అయిదారు నెలల్లో పూర్తవుతాయని, తర్వాత సాగుకు ఈ కాలువ ద్వారా పుష్కలంగా నీరందుతుందన్నారు.ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ఈ నెలాఖరులోగా ప్రతి గ్రామానికీ సురక్షిత తాగునీటిని అందిస్తామన్నారు.పలమనేరు-కృష్ణగిరి జాతీయ రహదారిని నాలుగులేన్లకు విస్తరిస్తామన్నారు.కుప్పం ఆర్టీసీ డిపోలో వచ్చే ఏడాది జూలై నెలకల్లా అన్నీ ఎలక్ట్రిక్ బస్సులు ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.జననాయకుడు గ్రీవెన్స్ సెల్‌తోపాటు కలెక్టర్, కడా పీడీ నిర్వహించే గ్రీవెన్స్ సెల్స్ ద్వారా ప్రజల నుంచి వివిధ సమస్యలపై అందుతున్న అర్జీలకు వీలైనంత వరకు అప్పటికప్పుడు పరిష్కారాలు చూపుతున్నామన్నారు. ఒకవేళ ఎక్కడైనా సమస్య గడువులోగా పరిష్కారం కాలేదంటే, న్యాయపరమైన ఇబ్బందులున్నాయని గ్రహించాలన్నారు.అటువంటి సమస్యల పరిష్కారానికి కూడా కృషి జరుగుతోందన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి

● ఎంపీ దగ్గుమళ్ల



చంద్రబాబుతో కలసి కేంద్రమంత్రి అమిత్‌షాతో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కేంద్ర మంత్రులను కోరారు. బుధవారం ఢిల్లీలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో కలసి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలను వేరువేరుగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులను దుశ్శాలువలతో సత్కరించారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఓపెన్ పరీక్షల్లో మరో విద్యార్థి డీబార్

చిత్తూరు సెంట్రల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా బుధవారం తెలుగు, హిందీ, ఉర్దూ (ద్వితీయ భాష) పరీక్షలు జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. జిల్లా పరిశీలకులైన ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ అక్బర్ అలీ పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.చిత్తూరు సంతపేటలోని పీఎన్‌సీ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని మాల్ ప్రాక్టీస్ కింద పట్టుకుని డీబార్ చేశారు. జిల్లావ్యాప్తంగా 15 సెంటర్లలో 2747 మంది విద్యార్థులకు గాను 2302 మంది హాజరు కాగా, 444 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలి రోజున జీడీ నెల్లూరు సెంటర్‌లో నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన ఇన్విజిలేటర్ రంజిత్‌కుమార్‌ను పరీక్ష విధుల నుంచి తొలగించగా, జిల్లాలోని నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు అన్ని కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

● ఇంటర్ పరీక్షలకు 577 మంది గైర్హాజరు

జిల్లావ్యాప్తంగా 50 సెంటర్లలో బుధవారం ఇంటర్ ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు డీవీఈవో సయ్యద్‌మౌల తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తంగా 14,004 మంది విద్యార్థులకు గాను 13,426మంది హాజరు కాగా, 577మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. జనరల్‌లో 12,196 మందికి గాను 11,715 మంది హాజరు కాగా, 480మంది గైర్హాజరయ్యారని,ఒకేషనల్‌లో 1808 మందికి గాను 1711 మంది హాజరు కాగా, 97 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో తెలిపారు.

రూ.1.37 లక్షల విలువ చేసే రేషన్ బియ్యం పట్టివేత

చిత్తూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెండో పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. వివిధ కాలనీల్లోని పేదల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కైలాసపురం వద్ద ఉన్న ఓ గోడౌన్‌లో నిల్వ చేశారని పోలీసులకు ఫిర్యాదు అందింది. దాంతో సీఐ నెట్టికంఠయ్య, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది గోడౌన్‌పై దాడి చేశారు. ఈ దాడిలో రూ.1.37 లక్షల విలువ చేసే 110 బస్తాల బియ్యాన్ని సీజ్ చేశారు. నలుగురు కూలీలతో కలిసి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న పలమనేరుకు చెందిన భానుపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

టీటీడీ అన్నప్రసాద ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.కోటి విరాళంగా అందింది. హరియాణాకు చెందిన వినీత్ ఆరోరా, దివ్యా ఆరోరా ఈ విరాళాన్ని ఇచ్చారు. రూ.1.01 కోటి విరాళం డీడీని తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి బుధవారం రాత్రి అందజేసి అన్నప్రసాదం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

నేటి నుంచి మసాలా వడ వడ్డింపు

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో గురువారం నుంచి అన్నప్రసాదాల మెనూలో మసాలా వడను వడ్డించనున్నారు. అన్నప్రసాదాల మెనూలో మరో నూతన ఆహారపదార్థాన్ని వడ్డించాలని ఇటీవల జరిగిన బోర్డులో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఇటీవల ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. గురువారం నుంచి నిరంతరాయంగా మసాలా వడను వడ్డించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం 10.30 గంటలకు ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈకార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

రుయాస్పత్రి రూపురేఖలు మారుతున్నాయ్!

కలెక్టరు ఆదేశాలతో శరవేగంగా మౌలిక వసతుల కల్పన





ఓపీ కేంద్రం ముందు ఏర్పాటు చేసిన బోర్డు - అత్యవసర విభాగంలో వైద్యుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఛాంబర్

తిరుపతి(వైద్యం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. గతనెల 14వ తేదీన రుయాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్ అక్కడి సమస్యలపై అసహనం వ్యక్తం చేయడమేగాక అధికారులపై మండిపడిన విషయం విదితమే. మళ్లీ వచ్చేసరికి ఆస్పత్రి రూపురేఖలు మారాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఒకవైపు సమస్యలను పరిష్కరిస్తూ, మరోవైపు మౌలిక వసతుల కల్పన పనులు చేస్తున్నారు. అభివృద్ధి పనులను బుధవారం సూపరింటెండెంట్ రవిప్రభు పరిశీలించారు. భవిష్యత్తులో రోగులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్య పరీక్షల రిపోర్టులు ఏ రోజుకారోజు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఫార్మసీలో ఉన్న నిల్వ మందులను రీజనల్ స్టోర్‌లోకి మార్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. రక్తపరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వంటి సేవలు ఒకేచోట ఉండేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రోగులకు తాగునీరు, వారికి అందుబాటులో ఉండేందుకు సిబ్బందికి ఏర్పాటు చేశామన్నారు. ఆస్పత్రిలో పార్కింగ్ ఇబ్బందులను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. మరో రెండు నెలల్లో కార్పొరేటుకు దీటుగా రుయాస్పత్రిని తీర్చిదిద్దుతామని చెప్పారు.

అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ తరలిస్తున్న లారీలు

శాంతిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీలను రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ సీజ్ చేశారు. ఆయన కథనం మేరకు.. గుడుపల్లె మండలంలోని ఓ క్వారీ నుంచి అక్రమంగా గ్రానైట్‌ను లారీలతో ఒంగోలుకు మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత తరలిస్తుండగా కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని మొరసనపల్లె వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా సరైన రికార్డులు లేకపోవడంతో గ్రానైట్ లారీలను స్వాధీనం చేసుకున్నారు. లారీలను పలమనేరు భూగర్భ గనులశాఖ అధికారులకు అప్పగించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సింగిల్‌విండో సీఈవోకు నివాళులు



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ (సింగిల్ విండో) సీఈవో సుబ్రహ్మణ్యం బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్సలు పొందారు. బుధవారం తెల్లవారుజామున కెంచనబల్లలోని స్వగృహంలో ఆయన కన్నుమూశారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, నేతలు మహ్మద్‌రఫీ, జయశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, నాగభూషణం, వెంకటరమణ, నవీన్, కామరాజనాయక్, మురళీమోహన్‌తోపాలు వన్నికుల క్షత్రియ సంఘం నేతలు, డీసీసీబీ ఉద్యోగ సంఘాల నేతలు సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గార్మెంట్స్ పరిశ్రమతో వెయ్యి మందికి ఉపాధి



సదస్సులో మాట్లాడుతున్న పద్మజ

వి.కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో గార్మెంట్స్ పరిశ్రమతో వెయ్యి మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు తెలిపారు. బుధవారం వి.కోటలోని ఓ కల్యాణ మండపంలో వెలుగు స్వయం సహాయక సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జిల్లా కార్మికశాఖ అధికారి పద్మజల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు కేంద్రంగా నడుస్తున్న ప్రముఖ గార్మెంట్స్ సంస్థ ఈస్ట్‌మెన్ ఎక్స్‌పోర్ట్స్ వారు వి.కోటలో యూనిట్ స్థాపించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. స్థానికులకు ఉపాధి ఉంటుందని, మండల వ్యాప్తంగా సర్వే చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తామని గార్మెంట్స్ సంస్థ ప్రతినిధులు కార్తీక్ తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధులు రాంబాబు, చౌడప్ప, ఎంపీడీవో ఈశ్వరన్, ఏపీఏలు లావణ్య, పార్వతి పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



శాంతిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా విద్యాసామగ్రి అందించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు అందించాలి



రోగులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డీటీ సుధారాణి

పలమనేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డీటీ సుధారాణి సూచించారు. బుధవారం పలమనేరు మండలం కొలమాసనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలో చికిత్సలు పొందుతున్న వారితో వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దిగువమారుమూరు గ్రామానికి వెళ్లి ఆరోగ్యసిబ్బంది చేస్తున్న ఎన్‌సీడీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంవో ప్రవల్లిక, వైద్యురాలు సుధారాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



పలమనేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని భవిత కేంద్రాన్ని బుధవారం సమగ్రశిక్ష కోఆర్డినేటర్ డాక్టర్. వి. విజయప్రకాష్‌నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలసుందరం, ఐఈఆర్‌పీలు మంగేశ్వరి, మురళీ పాల్గొన్నారు.

కృష్ణమూర్తి సేవలు అభినందనీయం



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

చౌడేపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పోస్టుమ్యాన్ కృష్ణమూర్తి సేవలు అభినందనీయమని జడ్పీటీసీ దామోదర్ రాజు పేర్కొన్నారు. బుధవారం చౌడేపల్లెలోని ఓ మండపంలో ఆయన పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. 44 ఏళ్లపాటు సేవలందించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రుణాల చెక్కులు అందిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రధానమంత్రి అభ్యుదయ యోజన పథకంలో మహిళా సంఘ సభ్యులకు రాయితీ రుణాలు అందించారు. కార్యక్రమంలో ఏపీఎం కృష్ణప్ప, సీసీలు నూర్‌మహ్మద్, వసంత, సంఘమిత్రలు నాగవేణి, శ్రీనివాసులు, రాధ, నాయకులు చైతన్యరాయల్, సోము, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుత్తణి కొండచుట్టూ మంటలు



బంగారు తిరుత్తణి కొండ సమీపంలో పొలంలో అంటుకున్న మంటలు

సోమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి కొండ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆ మంటలు కొండ చుట్టూ వ్యాపించాయి. బుధవారం ఉదయం నుంచి మంటలు పొలాల వైపు మళ్లడంతో పలువురి రైతుల మామిడి తోటల్లోకి వ్యాపించాయి. రైతులు మంటలు ఆర్పేందుకు పలు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. తోటల్లోని పలు వృక్షాలు కాలిపోయాయి. పూత దశలోని మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ క్రమంలోనే అడవిలోని పలు వన్యప్రాణులు పొలాల వైపు పరుగులు పెట్టాయి. పలువురి రైతుల పొలంలోని డ్రిప్ పరికరాలు, పీవీసీ పైపులు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఆవులపల్లె శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

సోమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లెలో కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం ఆలయాన్ని పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు పుష్పాలంకరణ, అభిషేక పూజలు చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలకు ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె ప్రజలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో శివరత్న పేర్కొన్నారు. బుధవారం సోమలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలోనే దుకాణాలు, హోటళ్లు, మోటర్ మెకానిక్ షెడ్‌లను సందర్శించి బాల కార్మికులుగా పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేయిస్తామని అవగాహన కల్పించారు. కందూరు, పెద్దఉప్పరపల్లె, నంజంపేటల్లో తనిఖీలు చేశారు.

రైతుల సంక్షేమానికి బాసటగా ప్రభుత్వం

శాంతిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి బాసటగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన శాంతిపురంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నారన్నారు. బీసీల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలను బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించిందని.. చేనేతలకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలను కేటాయించారన్నారు. ముఖ్యమంత్రి బీసీల అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శోభ బుధవాం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న చిత్తూరులో ప్రవేశ పరీక్ష ఉంటుందని.. వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు



పలమనేరులోని దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పలమనేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని జవుళి వీధి, గంగమ్మగుడి వీధుల్లోని దుకాణాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పన్నుల బకాయిలు చెల్లించని దుకాణాల స్వాధీనం



దుకాణాన్ని స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించని దుకాణాలను మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పన్నుల బకాయిలున్న దుకాణాల వద్దకు వెళ్లి హెచ్చరించారు. ఆయన వెంట టీపీవో జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగని గజదాడులు..!

● పంటలకు అపార నష్టం ● పరిహారం నామమాత్రం
● ఏనుగులతో బీడుగా పొలాలు ● కన్నీరు పెడుతున్న అన్నదాత



ఇరికిపెంటలో ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన టమోటా



ఏనుగులు ధ్వంసం చేసిన డ్రిప్ పరికరాలు

సోమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల వరుస దాడులతో పంటలకు అపార నష్టాలు.. పెరిగిన సాగు ఖర్చులతో పొలాలు బీళ్లగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులకు జలకళ సంతరించుకున్నాయి. రైతులు వరి సాగుకు ఆసక్తి చూపడం లేదు. సాగు పెట్టుబడులు భారీగా పెరగడం, ట్రాక్టర్‌తో దుక్కులకు గంటకు రూ. వెయ్యి మించడం, కూలి రూ.500 లకు చేరుకోవడంతో సామాన్య రైతులు సేద్యం చేయలేక పోతున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు సాగులోకి తెచ్చుకున్నా అడవిపందులు, ఏనుగులు, దుప్పులు, నెమళ్లు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. సోమల మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పేటూరు, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని గ్రామాల్లో నెలల తరబడి ఏనుగులు తిష్ట వేసి పంటలను ధ్వంసం చేయడం.. మామిడి సీజన్‌లో చెట్లను, పండ్లను, టమోటా పంటను తొక్కివేయడంతో రైతన్నలు నష్టపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి సాగు చేసిన టమోటాలకు ఊతంగా నాటిన కర్రలను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈక్రమంలోనే పొలాలు బీటులుగా మారుతున్నాయి.

పరిహారం అంతంతే...

ఏనుగుల దాడుల్లో పంటలు కోల్పోతున్న రైతులు ఫొటోలు తీసి పంట నష్టాలను అటవీ అధికారులకు, వీఆర్వో, ఉద్యానశాఖ, వ్యవసాయ శాఖ అధికారులకు అందజేసినా నామ మాత్రపు పరిహారం మంజూరు చేయడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఏనుగుల దాడులతో నష్టం జరుగుతుందని అప్పటి రాష్ట్ర ఫారెస్టు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్ రెడ్డి, చైతన్యరెడ్డి, అటవీ జిల్లా అధికారులు సోమల మండలంలోని రాంపల్లె, కొత్తూరు, పట్రపల్లె, ఇర్లపల్లెలో ఏనుగుల సంచార స్థలాలను పరిశీలించి నష్ట పరిహారం పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ నష్ట పరిహారం యథాధిగా నామమాత్రంగానే మొక్కుబడిగా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం పెంచాలి



లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేస్తే కోత దశలో ఏనుగులు పంటలపై దాడులు చేసి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఏనుగులు సంచరిస్తున్న అటవీ శివారుల్లో కందకాలు తవ్వకాలు చేపడితే ఏనుగుల దాడులను అరికట్టొచ్చు. వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పెంచడానికి అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రమేష్ నాయుడు, చిన్నఉప్పరపల్లె

ఏనుగులతో వ్యవసాయమే వదిలేశాం



నాకు 10 ఎకరాల పొలం ఉంది. అందులో 5 ఎకరాలు మామిడి తోట, మిగతా మూడు ఎకరాల్లో వరి, టమోటా, ఇతర పంటలు సాగు చేస్తున్నాం. ప్రతిసారి ఏనుగుల దాడులతో పంట నష్టం జరిగేది. దీంతో వ్యవసాయమే చేయకుండా బీడుగా పెట్టేశా. మామిడి తోటల్లో ఏనుగులు సంచరించి పంటలను కోత సమయంలో ధ్వంసం చేయడంతో దిక్కు తోచక నష్టపోయి పొలం వైపు వెళ్ల లేకపోతున్నాం. ఏనుగులు, అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది.

- గుత్తా రెడ్డెప్ప నాయుడు, నాగిళ్లవారిపల్లె

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



పుంగనూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

పుంగనూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ధోబీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని.. గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార సరఫరాపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. గుడ్లు, పాలు, బాలామృతం సరఫరాపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి రుచి చూశారు. అనంతరం గిరిజన వసతి గృహాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఎస్ఎవో శంకరన్, తహసీల్దార్ రాము, ఆర్ఐ ఫణికుమార్, సీడీపీవో రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: మండలంలోని లద్దిగం అంగన్‌వాడీ కేంద్రం, పుదిపట్ల ఉన్నత పాఠశాల, చౌడేపల్లెలోని ఎస్సీ వసతి గృహాలను బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంఈవో కేశవరెడ్డి, సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన, హెచ్ఎం పద్మజ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కుప్పంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ కుప్పం కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. కుప్పం డిగ్రీ కళాశాలలో బుధవారం స్వచ్ఛ కుప్పం కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా స్వచ్ఛత, పరిశుభ్రతతో కలిగే ఆరోగ్య, సామాజిక లాభాలను అవగాహన చేసుకోవాలని సూచించారు. అనంతరం తమ తల్లిదండ్రులతోపాటు గ్రామగ్రామానా స్వచ్ఛ కుప్పం కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని, తద్వారా ఆరోగ్య సమాజ నిర్మాణానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఐఈసీలో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, వ్యర్థ రహిత పరిశుభ్ర మున్సిపాలిటీగా కుప్పం మున్సిపాలిటీని తీర్చిదిద్దుకునే యజ్ఞంలో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, ఐఈసీ కోఆర్డినేటర్ లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సర్వీసు ప్రొవైడర్లు వారి వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి సూచించారు. బుధవారం పలమనేరులో సర్వీసు ప్రొవైడర్లకు మెప్మా, అరుణ్ ఐటీఐ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలమనేరులో పట్టణ వాసులకు అవసరమైన సేవలు ఇంటి వద్దే అందిస్తూ కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో నెలకు కనీసం రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. ఎలక్ట్రికల్, కార్పెంటర్, శానిటరీ, ప్లంబింగ్, ఏసీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఆర్‌వోలు, బ్యూటీషియన్ తదితర సేవల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఇందుకోసం కొత్తగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహముద్దీన్, సీఎంఎం నీబీ బాబా, మెప్మా సీవోలు, ఆర్పీలు, సర్వీసు ప్రొవైడర్లు, కోఆర్డినేటర్ వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి.. నలుగురి అరెస్టు

చౌడేపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోడి పందెం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పుదిపట్ల పంచాయతీ తిరుమణిపల్లె సమీపంలో కోడి పందెం ఆడుతున్న పెద్దకొండామారికి చెందిన కాకతి వెంకటరమణ, కాగతికి చెందిన ఎంబాడి రామకృష్ణ, చిన్నకొండామారికి చెందిన కందుకూరి భరత్‌కుమార్, చెడుగుట్లపల్లెకు చెందిన చొక్కా గంగరాజులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు, రూ.8,250 నగదు స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

9న కుప్పం మండల సమావేశం

కుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న కుప్పం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయదత్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల సమావేశపు హాలులో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు వారివారి ప్రగతి నివేదికలను ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా మండల పరిషత్తు కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సోమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు పంచాయతీ పగడాలవారిపల్లె సమీపంలోని అటవీ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి రూ. 3 వేలు నగదును స్వాధీనం చేసుకుని పుంగనూరు కోర్టులో హాజరుపరిచారు.

నాయకనేరి కొత్తూరులో చోరీ

వి.కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం నాయకనేరి కొత్తూరులో భూపాల్‌నాయుడుకు చెందిన ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సభ్యులు గ్రామానికి దూరంగా ఉన్న బాలింతరాళ్ల బండ వద్దకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ.50 వేలు నగదు, 16 గ్రాముల బంగారు చైను చోరీ చేసుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌డీపీఐ అధ్యక్షుడి అరెస్ట్ దారుణం

పుంగనూరు రూరల్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జాతీయ ఎస్‌డీపీఐ అధ్యక్షుడు ఎం.కె.ఫైజిని ఈడీ పోలీసులు అరెస్టు చేయడం దారుణమని ఎస్‌డీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ఎస్‌డీపీఐ నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, విపక్ష రాజకీయ పార్టీ నాయకుల గొంతు నొక్కేస్తున్నట్లు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అరెస్టులు కొనసాగిస్తే తాము న్యాయమైన పోరాటానికి సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జమీర్‌లాల్, ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో బల్ల విద్యార్థి ప్రతిభ



రామకుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ సౌత్ జోన్ షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రామకుప్పం మండలం బల్లకు చెందిన పాపారావు కుమారుడు మౌనిష్ విశేష ప్రతిభ కనబరిచాడు. మౌనిష్ ఎస్వీ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 1, 2, 3 తేదీల్లో నల్గొండ ఎన్‌జీ కళాశాలలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల్లో సీనియర్ పురుషుల విభాగంలో మౌనిష్ మొదటి స్థానంలో నిలిచాడు. నిర్వాహకుల నుంచి అతను జ్ఞాపిక, మెడల్ అందుకున్నాడు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన మౌనిష్‌ను టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాణాచారి, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, స్థానిక నేతలు జయశంకర్, ఎర్రప్ప, మునిరత్నం, శంకర్, శ్రీనివాసులు, హనుమంతు, వెంకటేశ్ తదితరులు అభినందించారు.

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించేహక్కు రోజాకు లేదు: తెలుగు మహిళలు



మీడియాతో మాట్లాడుతున్న తెలుగు మహిళలు

చిత్తూరు సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు మాజీ మంత్రి రోజాకు లేదని తెలుగు మహిళలు హెచ్చరించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు జరిగినపుడు రోజా ఎక్కడున్నారో చెప్పాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని రాజ్యాంగం, హక్కులు, ప్రజాస్వామ్య విలువలు ఇప్పుడు గుర్తుకు వచ్చాయా అని వారు ప్రశ్నించారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని, త్వరలోనే రోజా కూడా జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు రాణి, నగర అధ్యక్షురాలు వరలక్ష్మి, చిత్తూరు పార్లమెంటు మహిళ కార్యదర్శి శ్రీదుర్గ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వెనకబడ్డారని 9మంది సచివాలయ సిబ్బంది జీతాల నిలిపివేత

యాదమరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పీ-4, ఎన్‌సీడీ తదితర సర్వేలు చేయడంలో వెనుకబడ్డారనే కారణంతో 9మంది సచివాలయ సిబ్బంది జీతాలు నిలిపివేసిన సంఘటన యాదమరి మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని కీనాటంపల్లి పంచాయతీ సచివాలయంలోని ఎనిమిది మంది సిబ్బందికి, కోణాపల్లి సచివాలయంలో ఒకరికి ఫిబ్రవరి నెల జీతాలు ఆపినట్లు సమాచారం. వివరాల మేరకు కీనాటంపల్లి పంచాయతీ సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి సర్వేలో వెనుకపడ్డారనే నెపంతో విధుల్లో ఉన్న అందరికీ జీతాలను కార్యదర్శి ఆపినట్లు ఎనిమిది మంది సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వేణును వివరణ కోరగా... కీనాటంపల్లి సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి సర్వేలో మండల పరిధిలో బాగా వెనుకబడిన నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు తాత్కాలికంగా ఆపామని... రెండు మూడు రోజుల్లో జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



మాట్లాడుతున్న మోహన్‌రాజ్

చిత్తూరు సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఫించన్‌ను రూ.4 వేలకు పెంచి ప్రతి నెల 1వ తేదీన అందజేస్తున్నామని చెప్పారు. మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు తదితర హామీలు నెరవేర్చామని తెలిపారు. అలాగే ఉచిత ఇసుక, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణం తదితర అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నేతలు మేషాక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు తీసుకున్న విద్యార్థులతో అధికారులు

గంగాధరనెల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో చదువుతున్న 54 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. నేషనల్ బ్లైండ్‌నెస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం గంగాధరనెల్లూరు మండలం కోటాగారం పంచాయతీ ఎట్టేరివద్ద భానోదయ స్కూల్‌లో 1450 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అందులో గుర్తించిన 54 మందికి బుధవారం గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో సీహెచ్‌వో శ్రీనివాసులు, స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు కంటి అద్దాలు పంపిణీ చేశారు. మణిమేఖలై, మౌనిక, ఏఎన్ఎం అమరావతి, ఆశా వర్కర్లు, టీచర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో పొగతాగడం నేరం



పొగాకు ఉత్పత్తుల హానికరంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, మార్చి 5: బహిరంగ ప్రదేశంలో పొగతాగడం చట్టరీత్యా నేరమని పొగాకు ఉత్పత్తుల శాఖ స్టేట్ లీగల్ అడ్వయిజర్ శివశంకర్ అన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం - హానికరంపై బుధవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ, సిగరెట్, తంబాకు, ఖైనీ వంటి వాటిని వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. కళాశాలల సమీపంలో ఉన్న టీ బంకులు, కిరాణాషాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించకూడదన్నారు. విద్యార్థులు పొగాకు జోలికి వెళ్లకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఎక్సైజ్, మున్సిపల్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 78 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులతో అధ్యాపకులు

నగరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, అమెజాన్ వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాల కొరకు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 96 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అందులో ప్రతిభ ప్రాతిపదికన 78 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ పంకజం, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ రేవతి, జేకేసీ మోటివేటర్ లాల్‌బాషా, కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

చెత్త నుంచి సంపద తయారీ.. కేంద్రం నిర్వహణపై నేడు శిక్షణ

తవణంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై మండలంలోని మేజరు గ్రామ పంచాయతీ అరగొండలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మురగేషన్ తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, చిత్తూరు నియోజకవర్గంలోని రెండు మండలాలు, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఒక మండలంలోని గ్రామ కార్యదర్శులు, ఈవో పీఆర్డీలకు స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

వేలం ద్వారా రూ.14.25 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు, సర్పంచ్

ఐరాల(కాణిపాకం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): కాణిపాకం పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.14,25,000 ఆదాయం లభించినట్లు సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి కుసుమ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం పంచాయతీకి సంబంధించిన వివిధ వేలం పాటలను నిర్వహించారు. ఈ వేలంలో వారపు సంతను అగరంపల్లెకు చెందిన రాధ రూ.7,64,000కు, దినసరి సంతను రూ.6,11,000కు దక్కించుకున్నారు. అగరంపల్లె చెరువును సి.జయచంద్రారెడ్డి రూ.20,000కు దక్కించుకున్నట్లు తెలిపారు. కాణిపాకం చెరువును జీఎస్.మురళి రూ.30,000కు కైవసం చేసుకున్నట్లు వారు వివరించారు.

8న లోక్‌అదాలత్

చిత్తూరు లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జరుగనున్న లోక్‌అదాలత్ ద్వారా క్రిమినల్ కేసులు, సివిల్, వాహనాలు, చెక్‌బౌన్సు, బ్యాంకు, డీసీసీఎంసీ, బీఎస్ఎన్ఎల్‌తో పాటు పలు కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మద్యం విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మొగిలివారిపల్లెకు చెందిన విశ్వనాథం తన ఇంటి వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించి 50 ఆంధ్రా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: మహిళకు గాయాలు

విజయపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని పాతార్కాడు మలుపు వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. తమిళనాడు రాష్ట్రం పాతార్కాడుకు చెందిన సుగుణ, భర్త అన్నామలైతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరి వైపు వెళుతుండగా.. నగరి మండలం నాగరాజుకుప్పం నుంచి కనకమ్మసత్రం వైపు వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో సుగుణ తలకు రక్తగాయాలు కావడంతో తిరువళ్లూరు జీహెచ్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

మద్యం స్వాధీనం - ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పాటు అరెస్టు చేసిన విక్రేతలను చూపుతున్న పోలీసులు

నగరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధి బైపాస్‌రోడ్డులో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ బుధవారం దాడి చేశారు. షాపులో ఉన్న 494 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.72,793 ఉంటుందని డీఎస్పీ తెలిపారు. ఈ దాడిలో సీఐ మహేశ్వర్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయ షాపుల వేలం

చిత్తూరు కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయం ఆధ్వర్యంలోని దుకాణాలకు గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నియమ్మ గుడి వీధిలో 17-50 నెంబరు షాపు, రాముల గుడి వీధిలోని 11-298 నెంబరు షాపు, పిళ్లారి గుడి వీధిలోని 11-526/5 నెంబరు షాపు, సంతపేటలోని 5-715 నెంబరు షాపులకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితిపై వేలం నిర్వహిస్తున్నామని, హెచ్చు పాటదారులకు షాపులు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు.

సారా రహిత గ్రామం కోసం కృషి

విజయపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేవీపురంను సారా రహిత గ్రామంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కేవీపురంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారాతో కలిగే అనర్థాలను వివరించారు. యువత, మహిళా సంఘాలు, పెద్దలు సహకరిస్తే గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. అనంతరం సారా రహిత గ్రామంగా మార్చుకోవాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. సారా తయారీ, అమ్మకాల గురించి తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 14405కు, 9440902549కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ బలరాం, టీడీపీ నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరి ఆలయానికి రూ.6.90 లక్షల ఆదాయం

తవణంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణ కోసం బుధవారం జరిగిన బహిరంగ వేలం ద్వారా రూ.6.90 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో హనుమంతరావు తెలిపారు. ఈ వేలంలో సంవత్సర కాలానికి తలనీలాల సేకరణ హక్కు కోసం యాదాద్రి భువనగిరికి చెందిన ఏడుకొండలు రూ.5,70,000 హెచ్చు పాట పాడుకోగా, కొబ్బరి చిప్పల సేకరణ కోసం తవణంపల్లె మండలంలోని పట్రపల్లెకు చెందిన రమేష్ రూ.1,20,000 హెచ్చు పాట పాడుకొన్నారు. శాశ్వత దుకాణాలు, పాదరక్షల వేలం వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమణప్రియ, పాటదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

రోడ్డు పక్కనే వ్యర్థాలు... ప్రమాదాలతో ప్రాణాలు హరీ..!

- ఇప్పటికే పలువురి మృతి
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

అవసరమైన చోట్ల కొత్త రోడ్లను వేస్తే తమ పని అయిపోయిందని ఆర్అండ్‌బీ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఆ తరువాత రోడ్డు పక్కనే పెద్ద పెద్ద బండరాళ్లను, మట్టిని, ఇతర వ్యర్థాలను దింపుతున్నా అధికారులు మాత్రం కార్యాలయాన్ని దాటి వెళ్లడం లేదు. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాల్లో వేగంగా వచ్చి పలువురు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు.





రోడ్డు పక్కనే దించేసిన రాళ్లు, ఇతర వ్యర్థాలు, వ్యర్థాలను దించుతున్న ట్రాక్టర్

చిత్తూరు నగరం నుంచి పలమనేరు రోడ్డు, వేలూరు రోడ్డు, పుత్తూరు రోడ్డు, తిరుపతి-బెంగళూరు బైపాస్ రోడ్లు ఉన్నాయి. నిత్యం ఈ దారుల గుండా వేలాది భారీ వాహనాలతో పాటు కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా వ్యవసాయ భూముల్లో ఉన్న పెద్ద పెద్ద బండరాళ్లు, గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలను రాత్రి 10 గంటల తరువాత లారీలు, ట్రాక్టర్లలో తీసుకొచ్చి రోడ్డుకు ఇరువైపులా దించేస్తున్నారు. ఎదురెదురుగా రెండు భారీ వాహనాలు వేగంగా వచ్చి అదుపు తప్పితే ఈ బండరాళ్లను మోదుకుని పెద్ద ఎత్తున ప్రమాదం జరిగిన సంఘటనలు కోకొల్లలు. ఆరు నెలల క్రితం వేలూరు రోడ్డులో ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గ్రానైట్ రాయిని ఢీకొని మృతి చెందాడు. అలాగే తిరుపతి-బెంగళూరు బైపాస్‌రోడ్డులో బండరాళ్లను తోలడంతో ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చిన ఇద్దరు సీతమ్స్ కళాశాలల విద్యార్థులు ప్రమాదవశాత్తు బండరాయిని ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలను తప్పించపోయి ఇదేవిధంగా పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు.

● **కార్యాలయం గేటు దాటని ఆర్అండ్‌బీ అధికారులు**

జిల్లాలోని ఆర్అండ్‌బీ రోడ్లపై పర్యవేక్షణ చేయాల్సిన ఆ శాఖ అధికారులు కార్యాలయ గేట్లను దాటడం లేదనే విమర్శలు ఉన్నాయి. నెలరోజుల క్రితం కుప్పం పర్యటనకు వెళుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇరువారం రోడ్డు పక్కనే వ్యర్థాలను దింపుతున్న లారీ డ్రైవర్‌ను మందలించి పంపారు. అయినా ఆ మరుసటి రోజు నుంచే తిరిగి అదే ప్రాంతంలో పది లారీల వ్యర్థాలను దించేశారు. చిత్తూరులోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీ రోడ్ల పక్కన వ్యర్థాలను దింపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వ్యర్థాలను తోలేవారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. **- చిత్తూరు అర్బన్, (ఆంధ్రజ్యోతి)**

2003 డీఎస్సీ టీచర్లకు ఓపీఎస్ వర్తింప చేయండి



ఆపస్ డైరీ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

చిత్తూరు సెంట్రల్, మార్చి 5 (ఆంధ్ర జ్యోతి): 2003 డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగాలు పొందిన వారికి పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ బుధవారం సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసు నాయుడితో కలిసి సీఎం నివాసంలో కలిశారు. సీఎంచే ఆపస్ డైరీ ఆవిష్కరణ అనంతరం విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని, అన్ని కేడర్లలో పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

మహిళా సాధికారత వారోత్సవాల్లో.... పెయింటింగ్ పోటీలు



గెలిచిన విద్యార్థినులకు బహుమతులను అందించిన పోలీసులు

చిత్తూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన బుధవారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జెండర్ ఈక్వాలిటీ అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతతో సమానత్వాన్ని ప్రతిబింబించే విధంగా పెయింటింగ్ వేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా మారింది. సోషల్ మీడియా వినియోగం పెరగడంతో మహిళల భద్రత ప్రశ్నార్థకరంగా మారింది. ఈ నేపథ్యంలో పెయింటింగ్ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు, యువతలో ఆలోచనా శక్తి పెరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆ శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంపై రైతులకు, వినియోగదారులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌లో 3 అర్జీలు రాగా, ఒకదానిని అప్పటికప్పుడే పరిష్కరించామని.. మిగిలిన వాటిని విచారణ చేసి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. డీఈలు ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

విజయపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లత్తూరులో బుధవారం మండల పశు వైద్యాధికారి శివకుమార్ ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తామని, ప్రతి పాడిరైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వేసవి కాలంలో పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.

ఫైజీ అరెస్టు అప్రజాస్వామికం

చిత్తూరు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మనీ లాండరింగ్ కేసులో సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) జాతీయ అధ్యక్షుడు ఫైజీ అరెస్టు అప్రజాస్వామికమని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆసీఫ్, సెక్రటరీ తౌఫిక్ అన్నారు. ఫైజీ అరెస్టును నిరసిస్తూ బుధవారం దర్గా సర్కిల్ వద్ద ఆయన నేతృత్వంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్టంలో మార్పులకు వ్యతిరేకంగా ఫైజీ పోరాటం చేస్తున్నారని చెప్పారు.

రెండో పెళ్లి కేసులో ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ముగ్గురు పిల్లలు పుట్టాక మరో యువతికి మాయమాటలు చెప్పి డబ్బుల కోసం రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రెండో పెళ్లి చేసుకున్న భర్త రవీంద్రబాబును అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కార్వేటినగరం మండలం టీకేఎంపేట కాలనీకి చెంది పి.కృష్ణయ్య కుమారుడు రవీంద్రబాబు 2013 సంవత్సరంలో కార్వేటినగరం పెద్ద హరిజనవాడకు చెందిన భాగ్యలక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో అదే గ్రామంలో ఉన్న ఏలుమలై కుమార్తె కాంచన అనే యువతికి మాయమాటలు చెప్పి డబ్బుల కోసం రెండో పెళ్లి చేసుకున్నాడు. దీనిపై రవీంద్రబాబు మొదటి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి, రవీంద్రబాబును అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.700 ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీకేఎంయూ నేతలు

చిత్తూరు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలకు రోజుకు రూ.700 చొప్పున కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామమూర్తి డిమాండ్ చేశారు. కూలీలకు వేతనాలను, కూలి దినాలను పెంచాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి పనులను సక్రమంగా కల్పించడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పాటు పనులు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలను ఆపాలంటే ఏడాదిలో 300 రోజుల పాటు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు కూలీలు మరణిస్తే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, సంఘ నేతలు మణి, రఘు, వెంకటేశ్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మమేకం కావాలి

వెదురుకుప్పం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటూ వారితో మమేకం కావాలని పార్టీ అధినేత జగన్ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మికి సూచించారు. బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కృపాలక్ష్మి కలిశారు.

సంపద కేంద్రాలపై దృష్టి పెట్టండి



మార్కెట్‌ను పరిశీలిస్తున్న డీపీవో సుధాకరరావు

పెనుమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరించి వాటి ద్వారా సంపద సృష్టించాలని డీపీవో సుధాకరరావు సూచించారు. బుధవారం ఆయన పెనుమూరు సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం బస్టాండులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న షాపింగ్ కాంపెక్స్‌ను పరిశీలించి త్వరలో వేలం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం మార్కెట్‌లో వసతులను కూరగాయల వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. పెనుమూరు, కలవగుంట సచివాలయాలను తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈవోపీఆర్డీ మహేశ్వరరెడ్డి, సెక్రటరీలు ప్రభుకిరణ్, శేషు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చికాపల్లంలో ట్రాఫిక్ సమస్య

- దుకాణాల ముందు ఆక్రమణలు
- రోడ్డుపై అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్



వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం కూడలిలో వాహనాల రద్దీ

వెదురుకుప్పం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్‌తో పాటు చిల్లర దుకాణాల ముందు ఆక్రమణలతో ఇబ్బందులు వస్తున్నాయి. పచ్చికాపల్లం కూడలిలో భారీ వాహనాలతో పాటు ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉందని స్థానికులు తెలిపారు. పచ్చికాపల్లంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడే వాహనాలను గంటల తరబడి పార్కింగ్ చేయడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. చిత్తూరు, పుత్తూరు, తిరుపతి వెళ్లడానికి కూడలి ప్రాంతం కావడంతో పాటు తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకూ ఈ మార్గంలోనే వాహన చోదకులు వెళుతుండటంతో వాహనాల తాకిడి పెరిగింది. అదేవిధంగా దుకాణాల ముందు రోడ్లపైనే స్థలాన్ని ఆక్రమించడం కూడా రోడ్డు ఇరుకుగా మారిపోయి రాకపోకలకు అవస్థలు ఏర్పడుతున్నాయి. పచ్చికాపల్లంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, ఆక్రమణల తొలగింపు విషయంలో చర్యలు తీసుకోవాల్సిన క్షేత్రస్థాయి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.